


# కరపత్రం

SINCE 2014

మంగళవారం నవంబర్ 05 2024 సంపుటి :0 సంచిక : 27 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4

## మూసీ పరివాహక ప్రాంతాల్లో 8న సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర!




**ఈ నెల 8న తన పుట్టిన రోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు.**

హైదరాబాద్: ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు చర్చించారు.

**భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం**

నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి.

### ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు: అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోన్న ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. 'కొనుగోళ్ల ప్రక్రియ ఎలా కొనసాగుతోంది? ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా?'అని ఆరా తీశారు.

కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. ఏమైనా సమస్యలు తలెత్తితే అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హైదరాబాద్ మినహా మిగతా 9 ఉమ్మడి జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించిన సంగతి తెలిసిందే. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకొని రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## 2028లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయం

- తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.
- యూఎస్‌లోని 'ఒవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ భాజపా' ఎన్నారైలతో ఆయన భేటీ అయ్యారు.



2 లో

## 24 గంటల ఉచిత కరెంట్.. కేసీఆర్ సాధించిన ఘనత : మాజీ మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్ పార్టీ 24 గంటల కరెంట్ విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి హరీష్‌రావు



2 లో

## సర్పంచ్‌లకు మార్చిలోగా బకాయిలు చెల్లిస్తాం:

- తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



హైదరాబాద్: తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్పంచ్‌ల బకాయిలకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని, రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడవద్దన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠి (చిట్‌చాట్)లో మాట్లాడారు. సర్పంచులకు మార్చిలోపు బకాయిలు చెల్లిస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరిగా భారాస నేతలు సర్పంచ్‌ల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన వారే.. ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారు? అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లితే.. కేంద్రం కేవలం రూ.400 కోట్లే ఇచ్చిందని మండిపడ్డారు.

2 లో

## యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక

**అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**



ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామ సభలు పెట్టి అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టామని అన్నారు.మరో రెండు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పక్రియ మొదలవుతుందని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం దానావాయిగూడెంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా ఇళ్ల నిర్మాణం పరిశీలన జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం రూరల్‌లో రూ.71 వేలు , అర్బన్‌లో లక్షా యాభై వేలు రూపాయలు ఇస్తుందని తెలిపారు. మిగిలిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం భరించి పేదవారి చిరకాల స్వప్నం నెరవేరుస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పింక్ కలర్ చొక్కా వేసుకున్న వారికే స్కీంలు ఇచ్చారని.. వారు ఇంకా అదే భ్రమలో ఉన్నారని విమర్శించారు. గ్రామ సభలు పెట్టి మంత్రుల ద్వారా ఇళ్లను అప్రూవ్ చేస్తామని అన్నారు. ఈ ప్రభుత్వానికి పేదవారికి అండగా ఉండాలనే ఆలోచన ఉందని స్పష్టం చేశారు. అర్హులైన వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఇళ్లు ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో లక్షా యాభై వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్పారని అన్నారు. కేవలం 91 వేల ఇళ్లు మాత్రమే కట్టి అందులో మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో 63 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు వివిధ దశల్లో నిలిచి పోయాయని.. వాటిని కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.



# సంపాదకీయం

## అనువాద వ్యాకరణం మనకింకా అలవాటు కావాలి!

తెలుగు సాహిత్యాన్ని ఇంగ్లీషు భాషా మాధ్యమం ద్వారా గ్లోబల్ తెర పైకి తెచ్చేందుకు ఇప్పుడిప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. ఆ ప్రయత్నాల్లో ఒకటి అజు పబ్లికేషన్స్ %-% ఛాయా పబ్లికేషన్స్ సంస్థలు రెండూ కలిసి TILT' (తెలుగు ఇన్ లిటరరీ ట్రాన్స్‌లేషన్) పేరుతో చేపట్టిన ఆన్‌లైన్ ట్రాన్స్‌లేషన్ వర్క్‌షాప్. తెలుగు నుంచి ఇంగ్లీషుకు అనువదించే సామర్థ్యం గల అనువాదకులు కొందరిని ఎంపిక చేసి, వారికి ఫ్రెంచ్ అనువాదకురాలు రాస్ ష్వార్జ్ మెంటార్‌షిప్‌లో, ఇతర ప్రపంచ స్థాయి అనువాదకుల ఆధ్వర్యంలో అనువాదంలో మెళకువలను బోధిస్తూ, అనుమానాలను నివృత్తి చేయటం ఈ ఆన్‌లైన్ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అజు పబ్లికేషన్స్ కో ఫౌండర్/ డైరెక్టర్ శ్వేత యర్రం, ఛాయా పబ్లికేషన్స్ రిప్రజెంటేటివ్ మైత్రిలతో 'వివిధ' జరిపిన సంభాషణ ఇది.

**ఈ ఆన్‌లైన్ ట్రాన్స్‌లేషన్ వర్క్‌షాప్ గురించి చెప్పండి. ఈ ఆలోచన ఎలా కలిగింది?**

రెండు ప్రచురణ సంస్థలు ఒక వేదిక మీదకి రావడం కావొచ్చు, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమైనా వ్యయ ప్రయాసలకు వెనుకాడకుండా ముందడుగు వేయడం కావొచ్చు... ఇలాంటి వర్క్‌షాప్ ప్రయత్నం మాకు తెలిసి బహుశా భారతీయ భాషల్లో మొదటిసారిగా జరుగుతున్నది.

తెలుగు భాషా సాహిత్యాన్ని ఇక్కడి స్థానిక రచనలతో పాటూ అనువాదాలూ సుసంపన్నం చేశాయి. రష్యన్ సాహిత్యం, శరత్ నవలలు, ఇంకా ప్రేమ్ చంద్, కిషన్ చంద్, తగళి శివశంకర పిళ్ళై, మహాశ్వేతా దేవీ, భిభూతి భూషణ్‌ల రచనలు... ఇలా చెప్పుకుంటే పోతే బోలెడంత మంది ఇతర భాషల రచయితలు తెలుగులో పరిచయమయ్యారు. అలానే, పక్క రాష్ట్రాల సాహిత్యం నుంచి ఇంగ్లీష్‌లోకి అనేక రచనలు వెళ్ళాయి. అక్కడి పాత తరమే కాదు, కొత్త తరం రచయితల రచనలు కూడా ఇంగ్లీష్ లోకి అనువాదం అవుతున్నాయి. అలా చూసుకున్నప్పుడు, తెలుగు భాషా, తెలుగు సాహిత్యమూ ఎక్కడ ఉన్నాయిా అన్న ప్రశ్నే ఈ వర్క్‌షాప్‌కి బీజం వేసింది. తెలుగు నుంచి ఇంగ్లీష్ అనువాదం మన దగ్గర చాలా తక్కువగా జరుగుతున్నది. అందువల్ల ఆ స్కిల్ సెట్ ఎక్కువగా పరిణతి చెందలేదు. అనువాదం అంటే కేవలం పదాల అనువాదం కాదు. ఆ రచన, రచయిత ఆత్మను పట్టుకోవడం. టార్గెట్ రీడర్స్ ఎవరని తెలుసుకొని అందుకు తగ్గట్లుగా అనువదించడం. అందుకు కసరత్తు అవసరం. అనువాదం ఇండియన్ ఇంగ్లీష్ లోకి వెళ్ళడం ఒక ఎత్తయితే, దాన్ని ఇంటర్నేషనల్ ఇంగష్‌లోకి తీసుకువెళ్ళడం మరొక ఎత్తు. మేం ఎంచుకున్న అనువాదకులందరూ తెలుగు %-% ఇంగ్లీష్ భాషలపై పట్టు ఉన్నవారే, అంతర్జాతీయ సమకాలీన సాహిత్యం చదువుతున్నవారే. వారికి కాస్త శిక్షణ ఇస్తే అద్భుతాలు చేయవచ్చు అనిపించింది. పైగా ఎక్కువ శాతం పార్టిసిపెంట్స్ 35 ఏళ్ల లోపు వాళ్ళు కనుక స్కోప్ ఫర్ ఫ్యూచర్ డెవలప్మెంట్ ఎక్కువ.

**ఈ ఆలోచన ఆచరణ దాకా రావటానికి జరిగిన ప్రయత్నం ఏమిటి? వర్క్‌షాప్ నిర్వహణకు ఫ్రెంచ్ అనువాదకురాలు రాస్ ష్వార్జ్‌నే ఎందుకు ఎంపిక చేశారు?**

మాటల మధ్యన వచ్చిన విషయాన్నీ ఇక్కడి దాకా తెచ్చింది మిత్రుడు అనిల్. ఆయన హర్షణీయం అనే పోడ్కాస్ట్ నడుపుతున్నాడు. అంతర్జాతీయ రచయితలూ, అనువాదకులతో అనేక ఇంటర్వ్యూలు చేశాడు. రాస్ ష్వార్జ్ ఈ ఆలోచనకి తగిన వ్యక్తి అని సలహా ఇచ్చింది తనే. ఐతే, రాస్ ఫ్రెంచ్ %-% ఇంగ్లీష్ అనువాదకురాలు కాబట్టి, తెలుగు తెలిసిన లోకల్ చెక్ పాయింట్స్ కూడా వర్క్ షాప్‌కి కావాలి అనుకున్నప్పుడు మాకు తట్టింది%-% రచయిత ఉణుదుర్తి సుధాకర్, అనువాదకుడు అవినేని భాస్కర్‌లు. అడగ్గానే వాళ్ళు కూడా ఒప్పుకొని మాకు భారం తగ్గించారు. రాస్ విషయానికి వస్తే ఆమె నాలుగు దశాబ్దాలుగా వంద పుస్తకాలను అనువాదం చేశారు. ఎన్నో ప్రసిద్ధ అంతర్జాతీయ బహుమతులూ అందుకున్నారు. ఆమె ఆధ్వర్యంలో మా పార్టిసిపెంట్స్ వివిధ పార్శ్వాలతో కలిసిన అనువాద వ్యాకరణం నేర్చుకుంటారని మా నమ్మకం.

**వర్క్‌షాప్‌లు జరిగే తీరు ఎలా ఉంటుంది?**

ఇది ఆరు నెలల వరకు, నెలకి మూడు గంటల పాటు జరిగే ఆన్‌లైన్ వర్క్‌షాప్. ఈ ఆరు నెలల్లో మా ఆరుగురు అనువాదకులు ఒక్కొక్కరూ సెషన్‌కు రెండేసి కథల చొప్పున అనువదిస్తారు. ప్రతి వర్క్‌షాప్ లోనూ ఆ అనువాదాల గురించి లోతుగా రాస్‌తో చర్చిస్తారు. రాసినదాన్ని మెరుగుపరిచే పద్ధతులను నేర్చుకుంటారు. ఇవన్నీ తరువాతి సెషన్‌కి వారు చేసే అనువాదాల్లో ఇంప్లిమెంట్ చేసుకుంటూ, కొత్త సమస్యలు ఎదురైతే వాటిని చర్చకు తీసుకొస్తారు. ప్రాంతీయత, రెండు భాషల మధ్య పొసగని తత్వం, ఆలోచనా విధానాల్లో వైరుధ్యం, డయాస్పోరా ఆఫ్ టార్గెట్ రీడర్స్, ఇడియమాటిక్ ఎక్స్‌ప్రెషన్స్ (నుడికారం), పఠనీయత లాంటి అన్ని అంశాలనూ కూలంకషంగా చర్చిస్తారు, నేర్చుకుంటారు. ఇందుకు రాస్ ష్వార్జ్‌తో పాటు గెస్ట్ స్పీకర్స్ కూడా సహకరిస్తారు. తమ రచనల్ని చర్చిస్తూ, మెంటార్ల సలహాలు పరిగణిస్తూ సమన్వయంతో సాగే ఒక పూర్తి ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ ఇది.

**తెలుగు నుంచి ఇంగ్లీష్‌కు అనువదించే క్రమంలో ఎదురయ్యే ఏ అంశాలపై, సమస్యలపై ఫోకస్ పెడుతున్నారు?**

అనువాదం అంటే కేవలం వెర్బాటిమ్ (ప్రతి పదం యథాతథంగా చేయటం) మాత్రమే కాదని చదువర్లుగా మేం నమ్ముతున్నాం. ఎంత కాదనుకున్నా అనువాదంలో కొంత నష్టం జరుగుతుందని మనం ఒప్పుకోవాలి. అలాగని పూర్తిగా భావమే విడిచిపెట్టి సొగసుగా నాలుగు మంచి పదాలు పొదిగి ఇచ్చేసి అనువాదం అంటే పెద్ద మోసమే కదా! పైన చెప్పినట్లుగా%-% అనువాదాల్లో సమస్యలు%-% ముఖ్యంగా ప్రాంతీయత, రెండు భాషల మధ్య పొసగని తత్వం, ఆలోచనా విధానాల్లో వైరుధ్యం, డయాస్పోరా ఆఫ్ టార్గెట్ రీడర్స్, రాస్ అన్నట్లు 'మ్యూజిక్ ఆఫ్ ది టెక్స్‌ట్', ఇవన్నీ చూసుకోవాల్సిన అంశాలు. దీనినే అనువాద వ్యాకరణం అని చెప్పుకోవచ్చు. దీని పైనే మా వర్క్‌షాప్ పూర్తి శ్రద్ధ పెడుతుంది.

వర్క్‌షాప్‌లో భాగంగా పార్టిసిపెంట్స్ చేసే అనువాదాలు కేవలం వర్క్‌షాప్ కోసమే గాక Asymptote, Words Without Borders లాంటి అనేక ప్రఖ్యాత అంతర్జాతీయ సాహిత్య జర్నల్స్‌లో ప్రచురితం అయ్యేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయాలన్నద దానిపై కూడా మెంటార్స్ ఫోకస్ చేస్తున్నారు.

**తెలుగులోని ఏ రచనలను ఇంగ్లీషులోకి తీసుకువెళ్ళాలీ అన్న ఎంపిక ఏ ప్రాతిపదిక మీద చేయబోతున్నారు? అనువాదం జరిగాక ఆ పుస్తకాల మార్కెటింగ్ స్ట్రాటజీ ఏమిటి?**

అనువాదం కేవలం సాహిత్య ప్రక్రియే కాదు, ఒక భాషా సమాజాన్ని మరో భాషా సమాజానికి పరిచయం చేయగలదు కూడా. మేము ఇంగ్లీష్ లోకి అనువాదం చేయించే రచనల్లో సమకాలీనతకి ప్రాధాన్యత ఇస్తున్నాం. లోకల్ ఈజ్ గ్లోబల్ అన్నవిధంగా%-% ఇక్కడి స్థానికత ఉట్టిపడుతూ, యూనివర్సల్ అప్పీల్ కూడా ఉన్న కథలని ఎంచుతున్నాం. ప్రస్తుతానికి, ఈ వర్క్‌షాప్ కోసం మా రెండు పబ్లి షింగ్ హౌసుల నుంచి వచ్చిన రచయితల కథలు మాత్రమే తీసుకున్నాం. ఇవన్నీ ఒక ఇంగ్లీష్ ఆంథాలజీగా తీసుకురావాలనేది మా ఉద్దేశం. ఏవి తీసుకోవాలీ అన్నది పూర్తిగా మా విచక్షణ. ముందుగా కథలను అనువదింపజేసి, వాటిని అంతర్జాతీయ సాహిత్య పత్రికల్లో ప్రచురణార్హం అయ్యేలా చూసి, తద్వారా అంతర్జాతీయ ప్రచురణకర్తలతో మాట్లాడి పుస్తకంగా తేవాలి అనుకుంటున్నాం.పుస్తకాల మార్కెటింగ్ విషయంలో తప్పనిసరిగా ఒక స్ట్రాటజీ ఉండాల్సిందే అని నమ్ముతాం. పబ్లిషర్లుగా మేం ఇప్పుడు తెలుగులో ఇన్ని వేల పుస్తకాలు అమ్మగలుగుతున్నామంటే అదే కారణం. ఈతరం తెలుగు మాట్లాడే వాళ్ళందరూ తెలుగు చదవగలిగే వాళ్లు కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉండే ఇంగ్లీష్ భాషా పాఠకులు, మన దేశంలోని ఇంగ్లీష్ పాఠకులు, తెలుగు చదవలేక కేవలం మాట్లాడగలిగేవారు... వీరంతా మా టార్గెట్. వీళ్లదాకా మా అనువాద సాహిత్యం తీసుకువెళ్ళడం కోసం అన్ని టచ్ పాయింట్స్‌నూ మేము దృష్టిలో ఉంచుకుంటాం.

## నల్గొండ ప్రజలకు మూసీ బాధలు ఇంకెన్నాళ్లు..-

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- యాదాద్రి జిల్లా సమస్యలపై బంజారాహిల్స్, మంత్రుల నివాస సముదాయంలోని మంత్రి కోమటిరెడ్డి నివాసంలో సమావేశం.
- హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి జిల్లా పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఇతర నేతలు.
- సీఎం యాదాద్రి టూర్ నేపథ్యంలో కోమటిరెడ్డి కీలక ప్రిపేటరీ మీటింగ్.
- మూసీ శుద్ధీకరణ ఆవశ్యకతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెల్దామన్న మంత్రి. ప్రభుత్వాన్ని బదునాం చేసే ప్రతిపక్షాలను కలిసికట్టుగా ఎండగడదాం.మానవత్వం ఉన్నవారెవరూ మూసీని అడ్డుకోరన్న మంత్రి.
- మల్లన్నసార్ నుంచి యాదాద్రి, మేడ్చల్ జిల్లాలకు తాగునీరు అందించే పనుల శంకుస్థాపనకు ఈ నెల 8 న ముహూర్తం ఫిక్స్.



హైదరాబాద్ నవంబర్ 4

మూసీ ప్రక్షాళనపై ప్రజల్లో ప్రతిపక్షాలు సృష్టిస్తున్న గందరగోళానికి తెరదించాల్సిన అవసరం ఉందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ నెల 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనకు వస్తున్న సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి పైవ్యాఖ్యలు చేశారు.

దశాబ్ధాలుగా ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే.. కాళ్లు, చేతులు వంకర్లుపోయి, క్యాన్సర్ వంటి జబ్బులతో చచ్చిపోతుంటే.. ఆనాడు బీఆర్ఎస్ పార్టీ కనీసం పట్టించుకున్న పాపానలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహంవ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కోట్లమంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రూ. 500 లకే గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచామని, లక్షలాది గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 22 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, సన్నాలకు రూ. 500 ల బోనస్ చెల్లిస్తున్నామని, 50 వేలమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన చేశామని, దేశంలో ఎక్కడాలేని విధంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి లక్షల మందిని నైపుణ్యవంతులను చేసేందుకు కృషి చేస్తున్నామని.. చేసింది ప్రజలకు చెప్పకోవాల్సిన అవసరం ఉందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి జిల్లాకు మంచినీటి సరఫరా అందించేందుకు రూ.210 కోట్ల రూపాయలతో ప్రారంభిస్తున్న పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెలకు మంత్రి సూచించారు.

మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మూసీ బాధితులను రెచ్చగొట్టి రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాలని ప్రయత్నిస్తున్నాయని.. పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేసి ఈ తప్పుడు ప్రచారాలను అడ్డుకోవాలని నాయకులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిన్నర మంది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఉద్దేశించిన మూసీ శుద్ధీకరణను చిన్న చిన్న కారణాలతో అడ్డుకొని ప్రభుత్వాన్ని బదునాం చేయాలని ప్రయత్నించడం క్షమించరానిదని ఆయన ఆగ్రహంవ్యక్తం. జిల్లా ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పోరాడకపోతే దశాబ్దాల మూసీ మురికి ప్రజల్ని మరింత పీడిస్తుందని.. అదే జరిగితే రాజకీయాల్లో కొనసాగడం దేనికని ఒకింత ఆవేదనవ్యక్తం చేశారు. అన్ని జిల్లాల ప్రజలు గోదావరి, కృష్ణానీళ్లతో వ్యవసాయం చేస్తూ, తాగునీటిని వాడుకుంటుంటే.. భయంకరమైన రసాయనలు కలిసిన మురికినీళ్లను ఉమ్మడి నల్గొండ ప్రజలు ఎందుకు వాడుకోవాలని ఆయన ప్రశ్నించారు.

అయితే, ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై విపక్షాలు చేసే విమర్శలను వెంకన్న తిప్పికొట్టినంతగా మరే నాయకుడు తిప్పికొట్టడంలేదని సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. పార్టీ నేతలపై ప్రతిపక్షపార్టీల నేతలు ప్రెస్ మీట్లలో, సోషల్ మీడియా వేదికగా అడ్డగోలుగా విమర్శిస్తుంటే ఇతర నేతలు మౌనంగా ఉండటం భావ్యం కాదని.. అందరం కలిసికట్టుగా విపక్షాలను ఎదుర్కోవాలని భువనగిరి ఎంపీ చామల అన్నారు. అంతేకాదు, ప్రభుత్వ నిర్ణయాలను, సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్దామని మరో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, చెప్పారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మదర్ డెయిరీ గుడిపాటి మధుసూదన్‌రెడ్డితో పాటు ఇతర జిల్లా నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనుల్లో జ్యాప్యం చేస్తున్నారని , ప్రజాసమస్యలను అనుగుణంగా పనులు చేయడంలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



బాలాజీ నగర్ డివిజన్ కె.పి.హెచ్.బి కాలనీ ధనలక్ష్మి సెంటర్ నేతాజీ పార్కు నందు అభివృద్ధి పనులు ఆగిపోయాయని పార్కులో పారిశుద్ధ్యం, ఎలక్ట్రిసిటీ, ఇంజనీరింగ్ పనులు పెండింగ్ లో ఉండడంవల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని స్థానికులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదులకు మేరకు మాజీ కార్పొరేటర్ బాబురావు తో కలిసి నేతాజీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా నేతాజీ పార్క్ నందు పనుల్లో అధికారులు జాప్యం చేయడం వల్లనే పనులు జరగడంలేదని ఎమ్మెల్యే అన్నారు. వాకింగ్ చేసుకునే వారికి అనుకూలంగా వాకింగ్ ట్రాక్ సరిగా లేదనీ , ఎలక్ట్రిసిటీ వల్ల పార్కులో సరైన లైటింగ్ లేకపోవడం, గత కొన్ని నెలలుగా పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడి చెత్తను అక్కడే ఉంచి నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని ఈ విధంగా అధికారులు నిర్లక్ష్య వైఖరికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులందరూ సమన్వయం చేసుకొని 15 రోజులలో పార్క్ లో ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు నేతాజీ పార్క్ అందుబాటులో ఉండే విధంగా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు , కూకట్ పల్లి నియోజకవర్గం, కో ఆర్డినేటర్ సతీష్ ఆరోరా , ప్రభాకర్ గౌడ్ జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## 2028లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. యూఎస్‌కు చెందిన 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ భాజపా' ఎన్ఆర్ఐ నేతలతో ఆయన దృశ్యమాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత నెలకొందని, రాష్ట్రంలో సీఎం హామీలకు విలువ లేకుండా పోయిందన్నారు. దక్షిణాదికి అన్యాయం పేరుతో ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని, మీడియా ప్రచారం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. భారాస పనైపోయిందని, ఆ పార్టీలో క్యాడర్ లేరన్నారు. ఆ పార్టీలో కొంతమంది నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదాయం కోసం కాకుండా ఆలయాల్లో ప్రజలకు సేవలందిస్తామని, హిందూ ధర్మం, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కనీసం ఐదుగురు విదేశీయులను భారత్‌లో పర్యటించేలా కృషి చేయాలని ఎన్నారైలకు ఆయన సూచించారు. దేశాభివృద్ధి కోసం తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

### మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గం

రాష్ట్రంలో మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గమని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు అప్పుల పాలవడానికి కారకులు భారాస, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట తప్పిందని విమర్శించారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని విన్నవించినా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో అణగదొక్కాలని చూస్తారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్, భారాస పార్టీలకు మాజీ సర్పంచ్ కుటుంబాల ఉసురు తగులుతుందన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 24 గంటల ఉచిత కరెంట్.. కేసీఆర్ సాధించిన ఘనత : మాజీ మంత్రి హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

**కాంగ్రెస్ పార్టీ 24 గంటల కరెంట్ విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు.**

హైదరాబాద్: 24 గంటల పాటు కరెంట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్లుగా జాతీయ కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్‌ను అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది భారాస, కేసీఆరేనని తెలిపారు. కానీ ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర కాంగ్రెస్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డిదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ సాధించిన ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో భారాస సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరో నిదర్శమని పేర్కొన్నారు.

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ వచ్చేసింది.. నవంబరు 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ

మొదటిపేజీ తరువాయి

(హైదరాబాద్): తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 5 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. 2025 జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం గతంలో పేర్కొంది. ఈ సంవత్సరం మే 20వ తేదీ నుంచి జూన్ 2 వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండో టెట్‌కు నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసి జనవరిలో పరీక్షలు జరుపుతామని గత ఆగస్టులో జాబ్ క్యాలెండర్ విడుదల సమయంలో ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది.టెట్ పేపర్-1కు డీఈడీ, పేపర్-2కు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందేందుకు టెట్ అర్హత ఉండాలని చెబుతుండటంతో వేల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా పరీక్షకు హాజరుకానున్నారు. టెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు తొమ్మిది సార్లు పరీక్షలు నిర్వహించగా...జనవరిలో పదోసారి జరగనుంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గత మే పరీక్షతో కలుపుకొని ఆరుసార్లు పరీక్షలు జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండోసారి టెట్‌ను నిర్వహిస్తుండటం విశేషం.

## లండన్ లో మంత్రి జూపల్లికి ఘన స్వాగతం




హైదరాబాద్ నవంబర్

లండన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రికి జూపల్లి కృష్ణారావుకు అభిమానులు, ఎన్ఆర్ఐలు, కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం నాయకులు భారీగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు.

మంత్రి జూపల్లికి స్వాగతం పలికిన వారిలో టీపీసీసీ కన్వీనర్ వేణుగోపాల్ గంప, ఐఓసీ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ గౌడ్, ఎన్ఆర్ఐ టీపీసీసీ సెక్రటరీలు సుధాకర్, అజయ్ రెడ్డి, సురేష్ రెడ్డి, అమర్ గోపాల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు. లండన్ లో మూడు రోజుల పాటు జరగనున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ లో పాల్గొనేందుకు మంత్రి జూపల్లి లండన్ వెళ్లారు.

రేపు లండన్ ఎక్సెల్ లో జరగనున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ లో పాల్గొని తెలంగాణ పర్యాటక స్టాల్ ను ప్రారంభిస్తారు. అనంతరం తెలంగాణ పర్యాటక ప్రమోషన్ లో భాగంగా కాసిల్ గ్రీన్ లో నిర్వహించనున్న రోడ్ షో లో మంత్రి జూపల్లి పాల్గొంటారు. నవంబర్ 6 న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో కలసి వరల్డ్ ట్రావెల్ మార్కెట్ లో నిర్వహించనున్న ఇన్క్రెడిబుల్ ఇండియా - చలో ఇండియా సాంస్కృతిక కార్యక్రమంలో మంత్రి జూపల్లి పాల్గొంటారు. మంత్రి జూపల్లి వెంట పర్యాటక అభివృద్ధి సంస్థ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక , సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టరు ప్రకాష్ రెడ్డి, తదితరులు ఉన్నారు

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం నవంబర్ 05 2024

# తమిళనాట తగ్గుతున్న ద్రవిడ పైత్యం




## ప్రత్యేక వ్యాసం

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

తమిళ రాజకీయాలు మెల్ల మెల్లగా ద్రవిడ వాదం నుండి పక్కకు తప్పుకుంటున్నాయి. 2024 ఫిబ్రవరి నెలలో తమిళ నటుడు విజయ్ స్థాపించిన "తమిళగ వెట్రి కళగం" పార్టీ తొలి బహిరంగ సమావేశం అక్టోబర్ నెలలో చెన్నై కి 155 కి.మీ ల దూరంలోని విక్రవాండి లో జరిగింది.ఈ భారీ బహిరంగ సభలో విజయ్ తన పార్టీ వైఖరిని వెల్లడించాడు.ద్రవిడ వాదం పేరుతో కుటుంబ పాలన చేస్తున్న డి ఎం కే పార్టీని పరోక్షంగా విమర్శించాడు.కొంత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మీద, ఇంకొంత రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ మీద విమర్శలు కురిపిస్తూ ఆయన తన ఉపన్యాసాన్ని రక్తి కట్టించడానికి తన వంతు కృషి చేశారు. టీవీకే తమిళనాడులో ఉనికిలోకి వచ్చిన మరొక మామూలు రాజకీయ పార్టీ అయితే కాదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు భావించినా, ఇది రాజకీయాలలో గుణాత్మకమైన మార్పు తీసుకురావడం తథ్యమని అన్నారు. టీవీకే ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే ఉనికిలోనికి వచ్చింది. ఇప్పుడు రాష్ట్ర స్థాయి తొలి సమావేశం జరుపుకుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి ఇష్టం లేని ఆంగ్లేయులు ఇస్లాం,క్రైస్తవం, నాస్తికత్వాన్ని, ద్రవిడవాదాన్ని తమిళనాట ప్రోత్సహించారు.

మత ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టారు.

అందులో భాగంగా ఆర్యుల దండయాత్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేసారు.

ఆర్యులు భారతదేశాన్ని ఆక్రమించి మూలవాసులను ద్రావిడులను భారత దక్షిణ భాగానికి నెట్టివేసారని ప్రచారం చేసారు. దీనికి హిందూ వ్యతిరేకతను కేంద్రంగా మార్చారు.బ్రిటిషర్లు తమిళనాట ఈవీ రామస్వామి నాయకర్ (పెరియార్)ను పావుగా వాడుకున్నారు.అప్పటికే తమిళనాడులో బలంగా పాతుకుపోయిన ఆంగ్లేయులు చర్చ్ సహాయంతో ఈ కుట్రకు ఆజ్యం పోసారు.1947 లో స్వాతంత్రం పొందిన భారత్ లో హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని, తమ భావ దాస్యులను ప్రోత్సహిస్తూ వచ్చారు ఈ విదేశీ శక్తులు.నాస్తికత్వం పేరుతో,హిందీ వ్యతిరేకత పేరుతో,హిందూ వ్యతిరేకతకు రాజకీయ రూపం తొడిగారు.తమిళనాడులో బలమైన హిందూ సంస్కృతి ఉంది.అద్భుత హిందూ మందిరాలున్నాయి.కాని అధికార అందలాలు అందుకోవాలంటే ద్రావిడ వాదం ఈ శక్తులకు ఆధారంగా మారింది. హిందుత్వ భావాలు బలంగా ఉన్నప్పటికీ ఈ ద్రవిడ వాద రాజకీయాల్ని ఆచరిస్తూ వచ్చారు.

పెరియార్ ను ఒక ఆరాధనీయుడిగా, అన్నాదురై ని ఒక సిద్ధాంతకర్తగా మార్చారు.

1966 వరకు తమిళనాడులో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ద్రవిడ వాద ప్రచారం ముందు తలవంచింది.దేశం పట్ల,ఈ దేశ సంస్కృతి పట్ల,దేశ చరిత్ర పట్ల అస్సలు అవగాహన కోల్పోయిన కాంగ్రెస్ బ్రిటిషర్లకు ప్రాక్సీ గా మారిపోయింది.

దాదాపు వందేళ్ల క్రితం మొగ్గతొడిగిన ద్రవిడ వాదానికి ఇప్పుడు నిజంగా నూరేళ్ళు నిండినట్లేనని రాజకీయ పండితులు అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు.

ఈవీ రామస్వామి ప్రారంభించిన ద్రవిడార్ కజకం నుండి విడివడి 1949 లో అన్నాదురై ప్రారంభించిన డి ఎం కే ను గెలిపించి మొదటి కాంగ్రేసేతర ముఖ్యమంత్రి అయ్యాడు. రెండేళ్లు పాలించిన అన్నాదురై 1969 లో చనిపోయిన తర్వాత కరుణానిధి డి ఎం కె పార్టీ పగ్గాలు చేపట్టాడు. అప్పుడు దేశం లో బలంగా ఉన్న కమ్యూనిస్టు భావజాలాన్ని డి ఎం కె కు జోడించి డి ఎం కె ను సెంట్రిక్ కమ్యూనిస్టు పార్టీ గా మలిచాడు.తర్వాత రాజకీయ స్వార్థాలు ఒంటబట్టించుకున్న ద్రవిడ పార్టీ చీలిపోయి ఎం జీ ఆర్ నాయకత్వంలో అన్నా డి ఎం కె ప్రారంభమయ్యింది.

అప్పటినుండి ఈ రెండు పార్టీలే అధికారంలో ఉంటూ వస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ డి ఎం కె కు జూనియర్ పార్టీగా సర్దుకుపోయింది.మధ్యలో కొన్ని చిన్న చిన్న ద్రవిడ పిల్ల పార్టీలు కూడా మొలకెత్తాయి. విజయకాంత్ పార్టీ,కమలహాసన్ పార్టీలు వచ్చినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ఈ ద్రవిడవాద, నాస్తికవాద,సెంట్రిక్ కమ్యూనిజం భావజాలంలో గింగిరాలు తిరుగుతున్న తమిళనాట బ్రాహ్మణుడైన కమలహాసన్ కూడా ఈ నాస్తికవాద ప్రవాహంలో ఈదులాడుతున్నాడు.కాని తమిళనాట హిందుత్వ భావజాలం మళ్ళీ ఊపిరి పోసుకున్నది.తమిళనాడులో అన్నామలై నాయకత్వంలో బిజెపి తన ఉనికిని చాటుకుంటున్నది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికలలో దాదాపు 19 శాతం ఓట్లు సాధించిన బిజెపి రాబోయే అసెంబ్లీ ఎన్నికల వైపు పయనిస్తున్నది.అన్నామలై తొలి సారి ద్రవిడవాదంపై దాడిచేస్తూ బిజెపి తమిళనాడులో అధికారంలోకి రాగానే దేవాలయాల పరిసరాల్లో ఉన్న పెరియార్ విగ్రహాలను తొలగిస్తామని ప్రకటించి సంచలనం రేపాడు.ఇప్పుడు రాజకీయ పాత్ర పోషిస్తున్న నటుడు విజయ్ ద్రవిడ కుటుంబ పార్టీలను అంతం చేయాలని పిలుపునిచ్చాడు.తమ పార్టీకి ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ ఆదర్శమని, అయితే దేవుడు లేడంటూ ఆయన బలపరచిన నాస్తికవాదాన్ని మాత్రం తమ పార్టీ అంగీకరించే ప్రసక్తేలేదని విజయ్ స్పష్టం చేశారు.

తమిళనాడును శాసిస్తున్న రెండు ద్రవిడ పార్టీలకి ప్రత్యక్షంగాను, కమల్‌హాసన్ వంటివారు స్థాపించిన పార్టీకి పరోక్షంగాను నాస్తికత్వం ఒక సూత్రం. అది మాత్రం తన పార్టీకి ఉండదని విజయ్ చెప్పారు. ఆ పార్టీల నుంచి ఈ కొత్త పార్టీని వేరు చేస్తున్నది బహుశా ఇదొక్కటే.

**మిగిలినదంతా కొత్త సీసాలో పాత సారాయే.**

బిజెపి నాయకుడు అన్నామలై తమిళనాట రాజేస్తున్న హిందుత్వ అగ్గిని దారిమళ్లించేందుకు విజయ్ ను కొన్ని హిందూ వ్యతిరేక శక్తులు ఉసి గొల్పుతున్నాయని ఒక ప్రచారం జరుగుతున్నది.

ఏదేమైనా తమిళనాడులో ద్రావిడ వాదం పలచబడుతున్నదని తెలిసిపోతున్నది.

కమ్యూనిజం సామ్యవాదం ప్రచారంలో ఉన్న రోజులు,ప్రభావం చూపిన రోజులు గటించాయి.ఈ కమ్యూనిజం సోషలిజం పేరుచెప్పుకొని మనుగడ సాగించిన రాజకీయాల రంగు వెలిసిపోయింది.

ద్రవిడవాదం కూడా ఈ కోవలోనికే వస్తుంది. ద్రవిడ సిద్ధాంతం డొల్లతనం బయటపడి నిర్వీర్యం అవుతున్నది. ద్రవిడ వాదంపై అన్నామలై తో ప్రారంభమైన దాడికి విజయ్ కూడా జత కలిసినట్టయ్యింది.

రాజకీయ రూపం తీసుకుంటున్న హిందుత్వ చైతన్యం ను తన పార్టీ వైపు మళ్లించాలని విజయ్ నాస్తిక వాద వ్యతిరేక వైఖరిని ప్రకటించాడు.

తమిళ రాజకీయాల్లో విజయ్ పార్టీ టి వి కె వెలుగొందుతుందా! లేదా మఖలో పుట్టి పుబ్బలో కనుమరుగవుతుందా! అని విశ్లేషకులు లెక్కలు కడుతున్నారు.

విజయ్ పార్టీ టి వి కె కూడా ఒక సినిమా గా మాత్రమే కనిపించి కనుమరగవుతుందా? లేక ఒక రాజకీయ శక్తిగా బలపడుతుందా? అన్నది రాబోయే కాలం చెబుతుంది.ఒకటి మాత్రం స్పష్టం గా కనబడుతున్నది.

తమిళనాడులో హిందూ ప్రభంజనం మొదలయ్యింది అని సూచనలు కనిపిస్తున్నాయి. ఇక ముందు తమిళ రాజకీయాలు హిందుత్వం చుట్టూ తిరగబోతున్నాయని అనిపిస్తున్నది.

త్వరలో అన్నామలై మళ్ళీ ప్రజా క్షేత్రంలోకి రాబోతున్నాడు.

ఇకపై అన్నామలై విజయ్ లు తమిళనాడులో హాట్ టాపిక్ గా మారబోతున్నారు.

ద్రవిడ కుటుంబ పార్టీల స్వార్థం,దోపిడీ ని తమిళులు అసహ్యించుకుంటున్నారు.

విజయ్ పార్టీ టి వి కె బహిరంగ సభ వేదిక పై నాస్తిక పెరియార్ ఫోటో తో పాటు అంబేద్కర్, రాణి వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ ల ఫోటోలు గమంచారా?

అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అని అందరికీ తెలుసు.

మరి రాణి వేలు నాచియార్,అంజలై అమ్మాళ్ లు ఎవరు?

రాణి వేలు నాచియార్ (1730- 1796) శివగంగ సంస్థానాన్ని 1780-1790 మధ్యలో పరిపాలించిన రాణి. ఈమె బ్రిటిష్ అధికారానికి వ్యతిరేకంగా పోరాడిన మొట్టమొదటి భారతీయ మహారాణి. ఈమె ధైర్యసాహసాలకి గుర్తుగా తమిళులు ఈమెను వీరమంగై అంటే "వీరవనిత"అని పిలుస్తారు.

అంజలై అమ్మాళ్ తమిళనాడులోని కడలూరుకు చెందిన భారతీయ స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక కార్యకర్త, సంస్కర్త మరియు రాజకీయవేత్త . స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నందుకు ఏడున్నరేళ్లు జైలు జీవితం గడిపారు. 1937 మరియు 1946లో ఆమె ఎన్నికల విజయాల తరువాత కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పని చేస్తూ, తమిళనాడు రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన తొలి మహిళల్లో ఆమె ఒకరు. నాస్తికుడు దేశ సంస్కృతీ చరిత్రకు వ్యతిరేకుడైన పెరియార్ కి దేశ భక్తురాళ్లైన రాణి వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ లకు పోలిక లేదు.విజయ్ కు ఈ విషయం పట్ల అవగాహన లేదని స్పష్టంగా తెలిసిపోతున్నది.ఆంగ్లేయుల తొత్తు అయిన పెరియార్ కు, ఆంగ్లేయుల వ్యతిరేక వీర వనితలను ఒకే గాట కట్టిన విజయ్ అయోమయం అతని అవగాహనా రాహిత్యాన్ని పట్టి చూపుతున్నది.జాతి వ్యతిరేక ద్రవిడ వాదాన్ని జాతీయ వాదాన్ని ఒక ఒరలో పెట్టడానికి విజయ్ తాపత్రయ పడుతున్నాడు.

తమిళనాట పెరుగుతున్న హిందూ జాగృతిని తన వైపు మళ్లించడానికి విజయ్ పొరపాటు అడుగులు వేసాడన్నది స్పష్టం.

ఇకపై తమిళనాడులో పాచిపోయిన ద్రవిడ వాదం, ఉబుకుతున్న హిందూ జాతీయ వాదం మధ్యన విజయ్ మిశ్రమ వంటకం తమిళులకు ఎలా రుచిస్తుందో విజయ్ కే తెలియాలి.

**ఒక్కటి మాత్రం స్పష్టం.**

అన్నామలై బిజెపి ప్రభంజనం తమిళనాడులో పెల్లుబికే సూచనలు కనిపిస్తున్నాయి. 1966 నుండి తమిళనాడులో ప్రభావం చూపిన ద్రవిడవాదం ప్రమాదంలో పడిందన్న విషయం అందరూ గ్రహిస్తున్నారు.

## కార్తీక మాసం దీపోత్సవం



**వర్గల్ నవంబర్ 04 కరపత్రం**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు, ప్రిన్సిపల్ సెక్రెటరీ, మరియు కమిషనర్ ఆదేశాల మేరకు దేవాలయంలో ప్రతినిత్యం 1008 ఎనిమిది దీపాలు వెలిగించుటకు మహిళా భక్తులకు దేవాలయం నుంచి ప్రమిదలు వత్తులు ఇవ్వడం జరిగినది అలాగే దీపోత్సవం అనంతరం వచ్చినటువంటి భక్తులకు కార్యనిర్వాణాధికారి ఎస్ అన్నపూర? ,భక్తులకు తాంబూలం గా కనుము, గాజులు, తమలపాకులు, కుంకుమ, పసుపు, పండ్లు అందించారు ఈ సందరరేగా వారు మాట్లాడుతూ స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు అర్చకులు ఆలయ సిబ్బందితో దీపోత్సవం చేపట్టారు ఆలయ ప్రాంగణంలో శివలింగకారంలో దీపాలను వెలిగించారని అన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాణాధికారి ఎస్ అన్నపూర? సిబ్బంది సుధాకర్, పాండు , నర్సింలు అర్చకులు రమేష్ శర్మ హరి ప్రసాద్ శర్మ , ఇతరులు పాల్గొన్నారు

## రోడ్లపై ధాన్యాన్ని పోసి ఇతరుల మరణానికి కారణం కావొద్దు

**సిద్దిపేట నవంబర్ 04 కరపత్రం**

సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందరరేగా వారు మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదం జరిగి చనిపోవుచున్నారు. బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలి, నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దు, రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు తగిలి చనిపోవడం జరుగుతుంది.రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీస్ అధికారులు సిబ్బంది కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు...

**- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్...**



**కరపత్రయికంటోన్మెంట్**

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివ ృద్దే ఏకైక లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుపరుస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి క ృషి చేస్తున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. సోమవారం కంటోన్మెంట్ రెండోవ వార్డు గన్ బజార్ కమ్యూనిటీ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 43 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ గత పాలకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేసి రాష్ట్రంలో అవినీతిని పెంచి పోషించి అక్రమణ దారులకు రాష్ట్రాన్ని అడ్డగా మార్చాలని ఆరోపించారు. ఈ క్రమంలో ప్రజలు కోరుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలనే క ృతనిశ్చయంతో ప్రజా పాలన ను ప్రజల ఆశీర్వాదంతో ముందుకు తీసుకుపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్,శ్యామ్ సన్ రాజు,రఫిక్,యూసఫ్ భాను,ఇస్మాయిల్, యాదగిరి,ఛైర్మన్ యాదగిరి,కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## చదువు తో పాటు క్రీడలకు ప్రాధాన్యత...

**కరపత్రం కంటోన్మెంట్**



నారాయణ పాఠశాలలో సోమవారం క్రీడా దినోత్సవాన్ని విద్యార్థుల తో పాటు జి. ఎం.గోపాల్ రెడ్డి ప్రారంభించారు. వీరు మాట్లాడుతూ. జీవితంలో చదువు తో పాటు ఆరోగ్యం కొరకు క్రీడలు ముఖ్యమన్నారు.క్రీడలు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంచడం తో పాటు భావి తరాలకు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.క్రీడల పట్ల అవగాహన పెంచి వాటి ఆవశ్యకత ను తెలియపరుస్తూ క్రీడలను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమన్నారు..ఈ కార్యక్రమంలో ఎ జి ఎం పురుషోత్తమ్ రెడ్డి ప్రిన్సిపల్, ఎ. ఓ.గంగాధర్, వైస్ ప్రిన్సిపల్,ఉపాధ్యాయుల తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 51 మందికి ? 33,000/- జరిమానా




**- గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి**

**గజ్వేల్ నవంబర్ 04,కరపత్రం**

గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి,సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, మరియు ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా, 51, మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి ప్రియాంక, ముందు హాజరుపరచగా విచారణ చేసి 51 మందికి ? 33,000/-వేల రూపాయల జరిమాన విధించారు ఈ సందరరేగా ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## రైతు బీమా 5 లక్షల ప్రొసీడింగ్లను అందజెత

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతు బీమా 5 లక్షల రూపాయలు ప్రొసీడింగ్లను బోగారి సునీత అనే రైతు చనిపోవడంతో ఆమె భర్త ధనుష్ కుమార్ కు మరియు అ గ్రామానికి చెందిన భోగిని అనిత చనిపోయినందుకు భర్త బోయిని కనకయ్యకు ఐదు లక్షల రూపాయల రైతు బీమా ప్రొసీడింగ్ను అందజేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి వారితో పాటు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ గజ్వేల్ మండల వ్యవసాయ అధికారి నాగరాజు ఏఎంసి డైరెక్టర్ రామా గౌడ్ కరా?కర్ రెడ్డి నర్సాగౌడ్ కాంగ్రెస్ నాయకులు సుఖేందర్ రెడ్డి , సురేష్,అంజాగౌడ్, బాలరాజ్ గౌడ్ రామచంద్ర రెడ్డి మంద నర్సింలు , అందొల్ నర్సింలు,తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచమంతటా పుష్ప 2 ఫీవర్..


## హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్న అడ్వాన్స్ బుకింగ్స్!

ప్రపంచమంతటా పుష్ప 2 ఫీవర్ పట్టుకుంది. ఇంకా ఈ సినిమా రిలీజ్ కు (2024 డిసెంబర్ 5) నెలరోజులే టైం ఉండటంతో హంగామా మొదలైంది. వరల్డ్ వైడ్‌గా 11,500 థియేటర్స్ లో రిలీజ్ కాబోతున్న పుష్ప 2 ఒవర్సీస్ అడ్వాన్స్ బుక్కింగ్స్ కూడా మొదలయ్యాయి. అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా ఇలా బుకింగ్స్ ఓపెన్ చేస్తే అలా హాట్ కేకుల్లాగా అమ్ముడుపోవడం పక్కా అనేలా ఉంది ఐకాన్ అల్లు అర్జున్ ఫీవర్.ఓవర్సీస్‌లో ప్రీ సేల్స్‌లో-600 లొకేషన్స్ లో 2200 షోస్ కి: $250K ప్రీమియర్స్ ప్రీ సేల్స్ మొదలై రికార్డ్స్ క్రియేట్ చేసింది పుష్ప2. 'రికార్డుల కోసం నడిచే పుష్ప రూల్ బుక్ అయినప్పుడు ఎవరి పాలన అయిన డామినేట్ అవ్వడం పక్కా' అనేలా ఉంది. తాజా అప్‌డేట్ ప్రకారం, నవంబర్ 2, 2024 నాటికి, పుష్ప 2 కొన్ని రాష్ట్రాలలో అత్యధికంగా 3,045 టిక్కెట్‌లను విక్రయించింది. గత శుక్రవారం నాటికి 1,800 టిక్కెట్ల విక్రయాలతో పోలిస్తే ఇది 71% ఎక్కువని ట్రేడ్ వర్గాలు తెలుపుతున్నాయి. అంతేకాదు షోల సంఖ్య కూడా మరింత పెరిగుతుంది అని అంటున్నారు.531 షోల నుండి, ప్రీమియర్ సేల్స్ మొదలవ్వగా ఇప్పుడు 1,522 షోలకు పెరిగింది. ఇలా USA లో అడ్వాన్స్ బుకింగ్ అమ్మకాలు జోరందుకోవడం మేకర్స్‌కి హ్యాపీ ఫీలింగ్ ఇస్తోంది. ఇక అమ్ముడుపోతున్న అడ్వాన్స్ బుకింగ్స్ సంఖ్య గంటగంటకు పెరుగుతూ వస్తోందనే విషయం గుర్తించుకోవాలి.




### పుష్ప 2 బడ్జెట్ అండ్ బ్రేక్ ఈవెన్:

500 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ ఇప్పటికే రూ.1085 కోట్లకి పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ ద్వారా రాబట్టింది. దాంతో వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద రూ.1200 కోట్లు బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో నిలిచింది. అంటే ఇది ఎంత పెద్ద టార్గెట్ అనేది ఆలోచిస్తేనే మైండ్ బ్లాక్ అవుతోంది. మరి పుష్ప2 తో అల్లు అర్జున్ ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తాడో చూడాలి.



# ప్రభాస్ కథ మెచ్చారు

మరో కొత్త కాంబినేషన్‌లో సినిమాకు అడుగులు పడుతున్నాయి. ప్రభాస్ కథానాయకుడిగా... ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ప్రశాంత్ వర్మ చెప్పిన కథకి ప్రభాస్ పచ్చజెండా ఊపడంతో ఈ కలయికలో సినిమాని హొంబలే ఫిలింస్ సంస్థ నిర్మించేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ప్రభాస్ చేతిలో చాలా సినిమాలున్నాయి. 'రాజా సాబ్' చివరి దశకు చేరుకున్నప్పటికీ, ఆ తర్వాత ఇంకా నాలుగు సినిమాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రశాంత్ వర్మ కూడా ఇప్పటికే రెండు సినిమాల్ని ప్రకటించారు. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా ఓ సినిమా, 'జై హనుమాన్' మరో చిత్రం. ఈ రెండింటి తర్వాత ప్రభాస్‌తో సినిమా ఉంటుంది. ఆయన మార్క్ ఫాంటసీ అంశాలతోనే ఆ సినిమా ఉంటుందని సమాచారం.

## తెలుగు వారిని నేను అవమానించలేదు.. తన వ్యాఖ్యలపై కస్తూరి క్లారిటీ



తాను తెలుగు వారిని అవమానించలేదని నటి కస్తూరి స్పష్టం చేశారు. తమిళనాడులో ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అక్కడ స్థిరపడిన తెలుగు వారిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వైరలైన విషయం తెలిసిందే. ఆ కామెంట్స్‌పై విమర్శలు ఎదురుకావడంతో క్లారిటీ ఇస్తూ ఆమె పోస్ట్‌లు పెట్టారు.'తెలుగు నా మెట్టినిల్లు. తెలుగు వారంతా నా కుటుంబం. ఇది తెలియనివారు నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు. తెలుగు వారు ఎంతోమంది నాపై ప్రేమాభిమానాలు చూపిస్తున్నారు. తమిళ మీడియాలో నా కామెంట్స్‌ను వక్రీకరిస్తూ వస్తోన్న వార్తలను తెలుగు ప్రజలు నమ్మొద్దని కోరుతున్నా. డీఎంకే పార్టీ నా కామెంట్స్‌ను వక్రీకరిస్తోంది. ఇలా నాపై నెగెటివిటీ తీసుకొచ్చి నన్ను బెదిరించే ప్రయత్నం చేస్తోంది. నేను తెలుగు వారికి వ్యతిరేకంగా మాట్లాడానంటూ విష ప్రచారం చేస్తోంది' అని కస్తూరి తన పోస్ట్‌లలో పేర్కొన్నారు తాజాగా ఓ రాజకీయ ప్రసంగంలో కస్తూరి మాట్లాడుతూ.. 300 ఏళ్ల క్రితం అంతఃపురంలో మహిళలకు సేవ చేసేందుకు తెలుగు వారు తమిళనాడుకు వచ్చారని ఆమె కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలు అటు తమిళనాట, ఇటు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర దుమారం రేపుతున్నాయి.

## ఈ సినిమాలో ప్రతి పది నిమిషాలకు ఒక ట్విస్ట్..: నిఖిల్



'స్వామిరారా', 'కేశవ' తర్వాత హీరో నిఖిల్ , డైరెక్టర్ సుధీర్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' . నిఖిల్ సరసన రుక్మిణీ వసంత్, దివ్యాంశ కౌశిక్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం నవంబరు 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో నిఖిల్ మాట్లాడుతూ ఈ చిత్రంపై తనకు నమ్మకముందన్నారు. తాజాగా ఈ చిత్రం ప్రీమియర్‌ను ప్రదర్శించగా మంచి స్పందన వచ్చిందని తెలిపారు. "స్వామిరారా'లో మిస్ అయిన ప్రేమికుడిని 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'లో చూస్తారు. ప్రేక్షకులు మరో ప్రపంచంలోకి వెళ్తారు. ఈ సినిమాలో ప్రతి పది నిమిషాలకు ఒక ట్విస్ట్ ఉంటుంది. క్లైమాక్స్‌లో ట్విస్ట్‌ను ఎవరూ ఊహించలేరు. ఈ కంటెంట్‌పై పూర్తి నమ్మకంతో ఈ మాటలు చెబుతున్నా" అని నిఖిల్ ధీమా వ్యక్తంచేశారు.'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'ను ఎప్పుడు తీశానో అని చాలామందికి సందేహం ఉందని నిఖిల్ అన్నారు. 'కార్తికేయ' సినిమా తర్వాత దీన్ని తెరకెక్కించాలని అనుకున్నట్లు చెప్పారు.. 'స్పై' కంటే ముందు రావాల్సిన సినిమా ఇదన్నారు. తాను ప్రస్తుతం చేస్తోన్న సినిమా మధ్యలో ఒక షెడ్యూల్ బ్రేక్ రావడంతో దీన్ని రూపొందించినట్లు చెప్పారు. ఇక ప్రస్తుతం నిఖిల్ 'స్వయంభూ'లో నటిస్తున్నారు. భరత్ కృష్ణమాచారి రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. ఈ సినిమాలో మరో నాయికగా నభా నటేష్ కనిపించనున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రంలో నిఖిల్ ఓ యోధుడిగా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం తను ఇప్పటికే మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు.

## సమంత మళ్ళీ పెళ్లి చేసుకోబోతున్నారా?.. సామ్ సమాధానమిదే!



బ్యూటీ సమంత, హీరో వరుణ్ ధావన్ నటించిన మోస్ట్ అవేటెడ్ వెబ్ సిరీస్ 'సిటడెల్: హనీ బన్నీ' ఈ వారం ఓటీటీలో స్ట్రీమింగ్ కి వస్తోంది. ఫ్యామిలీ మెన్ డైరెక్టర్ రాజ్ అండ్ డీకే డైరెక్ట్ చేసిన ఈ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ గురువారం (నవంబర్ 7) నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు రానుంది. ఈ నేపథ్యంలో సమంత వరుస ప్రమోషన్స్ తో దూసుకెళ్తోంది. రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత తన పర్సనల్ లైఫ్ అండ్ సెకండ్ మ్యారేజ్‌కి సంబంధించిన విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసి మరోసారి వార్తల్లో నిలిచింది.' మీరు మరో ఐటెం సాంగ్ చేసే అవకాశముందా అనే ప్రశ్న జర్నలిస్టు నుండి ఎదురవ్వగా 'ఇకపై స్పెషల్ సాంగ్స్ చేయను' అంటూ సమాధానమిచ్చింది. అలాగే మీరు సింగిల్‌గా ఉండడానికి ఇష్టపడతారా అని అడగగా.. 'ఉండను' అంటూ చెప్పింది. దాంతో సమంత ఎవరితో అయిన రిలేషన్‌లో ఉందా లేక త్వరలో పెళ్లి చేసుకోబోతుందా అని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.కాగా ఈ లేటెస్ట్ వీడియోతో.. పుష్ప 2 ఐటం సాంగ్‌లోనూ సమంత కొన్ని సెకన్లు కనిపిస్తుందనే వార్తలు జస్ట్ రూమర్స్ అని కన్ఫర్మ్ అయింది. నాగ చైతన్య నుంచి విడిపోయిన తర్వాత సినిమాలతో బిజీ అయిన సామ్.. త్వరలో మింగిల్ అయ్యే ఛాన్సెస్ ఉండే ఉంటుందని టాక్. ఇక ఏమవుతుందో చూడాలి.ఇకపోతే ఈ సిరీస్‌లో వరుణ్ ధావన్, సమంతతో పాటు సిటాడెల్‌లో నటించిన సికందర్ ఖేర్, కెకె మీనన్ మరియు షకీబ్ సలీమ్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సిరీస్‌ను భారత్‌తో పాటు సైబీరియాలో కూడా చిత్రీకరించారు. ఈ సిరీస్‌లో సమంత పూర్తిగా భిన్నమైన అవతార్‌లో కనిపించబోతోంది.